


# డిబ్బా

హిందీ భాషను రాజభాషగా చేయలన్నారు బాపూ. ఆ బాషలో చాలా పదాలు లేవు. చిన్న డబ్బానూ డిబ్బా అంటారు, రెయిలు పెట్టెనూ డిబ్బా అంటారు. రేల్ డిబ్బా. తెలుగు భాషేచాలా పదాలు అందించగలదు. దేనినైనా తర్జుమా చేయాలంటే తెలుగు భాషేసౌకర్యమైనది. విదేశీ భాషలకు, పరభాషలకు సరైన పదం తెలుగులో లభిస్తుంది. హాల్డేన్ అనే పాశ్చాత్య ప్రొఫెసర్ తెలుగు నేర్చి మెచ్చాడు. బ్రౌన్ దొర భారత భాగవతాలు చదివాడు. పండితులు గ్రాంధిక భాషపడిపోతున్నదనీ, వాడుక భాష వ్యాప్తిలోకి వస్తున్నదనీ భయపడి దొరవద్దకు వెళ్లి, తమ బాధ చెప్పుకున్నారు.

''పాండుక్ష్మా భూపాలుడు మిమ్ము జూపి చనియె మహాత్మా'' అని చదివితే దొరకు త్వరగా అర్థమై సంతోషించాడట. వేమన పద్యాలు సేకరించి మూడువేలవరకు పోగుచేసి వాటిలోని సారస్యం గ్రహించి ఆనందించింది పాశ్చాత్యుడే. తెలుగు భాషకు ఇటాలియనాఫ్‌ది యీస్ట్ అని బిరుదు. తెలుగువారినీ, తమిళులనూ పోలిస్తే తెలుగువారే బావుంటారన్నారు మన ఫస్ట్ గవర్నర్ జనరల్. ఒకే పదానికి రూపాంతరాలుండి హాస్యయుతంగా మాట్లాడటానికి బాగా పనికి వస్తాయి. అసలు తెలుగుపదం పలకటంలోనే వున్నది సొగసంతా'' అని తెలుగు ప్రొఫెసర్, తెలుగు బాష మీద వుపన్యాసం దంచుతున్నది. ఆమె పరిశోధకురాలు గూడాను.

'' ఈవిడకి తన ప్రాంతమంటే చాలా గర్వంగా వున్నది'' అనుకున్నది శ్రోతలలో ఒక విద్యార్థిని. ఆ విద్యార్థిని మరొక ప్రాంతీయ విద్యార్థిని. ప్రాచీన భాషలు అనే అంశంపై పరిశోధన చేయటానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం వారు అనుమతించి, ఉపకార వేతనం గూడా యివ్వ నిశ్చయించారు. పేరు సుషమ. లేచి నుంచున్నది.

యేమిటన్నట్టు చూసింది కలావతీ.

కథా నిలయం
5452
శ్రీకాకుళం

'' ఒక తెలుగు పదాన్ని తీసుకుని మీరు చెప్పినవన్నీ ఋజువు చేయాలి మేడమ్'' అన్నది.

''అలాగే. పదం నువ్వు యెన్నిక చేసి యిస్తావా? నేనే యెన్ననా?'' అనడిగింది కలావతీ.

'' ఇప్పుడే డిబ్బా అనే పదం తీసుకున్నారుగా మేడమ్. దాన్ని తెలుగులో డబ్బా అంటారు గదూ మేడమ్! దాని వుపయోగాలు రూపాంతరాలు చెప్పాలి మేడమ్. డబ్బాలో హాస్యం యెలా జొప్పిస్తారో తెలుసుకోవాలని వున్నది. మేడమ్'' అన్నది సుషమ.

''అలాగే. కూచోవచ్చు'' అన్నది కలావతీ.

విద్యార్థిని కూచున్నది.

''వింటున్నారా? డబ్బా అనే పదం సాధారణంగా పెద్దదనే అర్థం యిస్తుంది. కిరోసిన్ డబ్బా. లావుగా వున్నవాడిని హాస్యానికి డబ్బాలాగా వున్నాడంటారు. మందులున్న దాన్ని జాంబక్ డబ్బీ, ముక్కుపొడుం పోసుకున్నా దాన్ని ముక్కు పొడుం డబ్బీ అంటాము. స్వంత ఘోష ఆత్మ స్తుతి చేసేవారిని సొంత డబ్బా అని నిక్‌నేమ్ పెడతాము. తుఫాను నిధి, క్షామ నిధి వంటివి సేకరించటానికి డబ్బా కొంచెం చిన్నది చేతితో పట్టుకునే వీలున్నది తీసి పచ్చిగుడ్డ కట్టి, నాణేలు వేసేందుకు రూపాయి నాణెం దూరే కన్నం గీతలాగా చేసి వాయిస్తూ గలగల లాడిస్తూ తీసికెళతాము. ఇంకా, ముష్టివాడు డబ్బా చప్పుడు చేస్తూ యేదో పాడుతూ విసిగిస్తే ఆ డబ్బా చప్పుడు వినలేక నాణెం వేసి పంపేస్తాము. గుడ్డివాడూ అంతే, కళ్లు తిప్పుతూ, పాడుతూ, అమ్మా బాబూ అంటూ డబ్బా గలగలలాడిస్తే వినలేక గీకినా వినలేక నాణెం వేసి వదిలించుకుంటాము. మా పిన్ని కొడుక్కి మూడో యేడు. మాటలొచ్చేశాయి. కాని పాలు తాగే అలవాటు వదల్లేదు. వాడు వచ్చి ''అక్కా! డబ్బా పాలు'' అనేవాడు. యెత్తుగా అల్మారాలో వున్న గొల్లభామ మార్కు పాలడబ్బా తర్జనితో చూపేవాడు. వాళ్లమ్మ పనిలో వుండి కలిపి యిచ్చేదిగాదు ఆకలి కాగానే నన్నడిగేవాడు. వేడి నీళ్లలో కండెన్స్‌డ్ మిల్క్ అంటే

ఘనీభవించిన పాలు రెండు గరిట వేసి కలిపి యివ్వటమే. బావమరిది అయే అబ్బాయి తన బావరాగానే తన తల్లిని పొగడటం మొదలెట్టేవాడు ''మా అమ్మ వుంది చూశారూ బావగారూ మెస్మరిజం నేర్చి, ఆకలి రూపు మాపాలనీ, పరమేశ్వరీ సాక్షాత్కారం కావాలని ఒక తెల్లకాగితం మీద పెద్ద నల్లబొట్లు పెట్టి తదేకంగా చూస్తూ వంట గూడా మరిచి, పిల్లలకాకలి అని మరిచి చూస్తుంది. చూపు చెదిరిందా తపోభంగమే. పిల్లలు ఆకలికి అలమటించి నిద్రబోతారు''. అదొక రకం మెస్మరిజం, సాక్షాత్కారం వస్తుంది''.

''అదేం చెప్పటం రామూ'' అంటాము.

''మనది స్వంత డబ్బా పిన్నీ'' అనేవాడు రామూ. బావ వస్తూనే వాళ్లమ్మ యెంత గొప్పదో చెప్పకుండా ఆపగలిగేవాడన్నమాట.

అలా ధారాళంగా చెప్పుకు పోతుండగా, యిద్దరు స్త్రీలు , నడివయస్కురాళ్లు వచ్చి, ఖాళీ కుర్చీలాక్రమించారు.

''నెమ్మదిగా, మెల్లిగా, మెల్లిగా, నిమ్మళంగా అనేవి పర్యాయపదాలు చల్లగా అనే పదం వ్యంగ్యాన్ని చెపుతాయి. ఒక గొప్ప రచయిత హాస్యబ్రహ్మ అని పేరుబడినవాడు, తెల్లవారి పాలనలోని అవకతవకలని, క్రూరత్వాన్ని చెపుతూ, ''మేము (అంటే తెల్లవారు) ముందు వురి తీస్తాం. తర్వాత నిమ్మళంగా యెందుకు వురితీశామో విచారణ మొదలెడదాం. అంటే ట్రయల్'' అని చెప్తుండగా మొహం మీద నవ్వు దాగి పైకిరావాలని చూచేది. చిన్న పిల్లల్నీ పనివారిని అదుపు చేయటం కష్టమని కంగ్ఫ్యూసియస్ అనే వేదాంతి అన్నాడు. మా అక్క ''చలికాలంలో నీళ్లు కాచి బాల్చీల్లో వుంచి యిస్తాను యెటూ పోవద్దు. చన్నీళ్లు పోసుకోవద్దు'' అనేది పిల్లలు కంటబడరు. కేకేస్తే కూతురొచ్చేది. చెల్లెలు వీధిలో ముగ్గేస్తూ రాలేదు. '' ఆవిడేదీ?'' అనేది అక్క. ఆవిడ అనే పదం పెద్దవాళ్ల మీద వాడతారు. కోపం వెలిగక్కడానికి ఆవిడ అని వాడింది మా అక్క.

మా తోడు కోడలు యేడుపు అందుకునేది. ఆడబడుచు గారాలపట్టి యెద్దేవా చేసేది'' ఈవిడెప్పుడూ యింతే. బిడ్డ యింకా నెలరోజులకి బయటపడే యడముండగానే, యిప్పుడే గొడ్డలిపోట్లులాగా పెద్ద నెప్పులొస్తున్నట్టు,

యేడుపూ పెడబొబ్బలూ లంకించుకుంటుంది. నేను శీర్షోదయమౌతున్నా నెప్పి అనను. యేడుపసలే వుండదు. బిడ్డ నేలమీదపడి కేరుమనాలి. గది బయట వేచివున్న తండ్రికి పురుడైపోయిందని తెలియాలి'' అలా అంటూ తల తాటించి, మూతి అటు యిటూ తిప్పేది. అదే డబ్బా. సిగ్గు అనే బదులు ఛిగ్గు అని వాడితే హాస్యం. జరీ చీర అనటానికి జడీ చీర అంటే వెక్కిరింత. మూతి అనటానికి ముట్టె అని వాడితే గేలి చేస్తున్నారని'' అని చెప్పుకుపోతున్నది కలావతీ.

శ్రోతల్లో ఒకామె లేచి నిలబడింది. యేమిటన్నట్టు చూసింది కలావతీ.

''మీరప్పుడే స్వంత డబ్బా వాయిస్తున్నట్టు తోస్తున్న దండీ'' అని నవ్వు మొహంతో అన్నది.

''పోనీ అలాగే అనుకోండి'' అన్నది కలావతీ.

రెండో శ్రోత లేచింది. ఆమె వంక చూసింది కలావతీ

''మనం సెమినార్ పెట్టుకుంటే బాగుంటుందండీ''

మరొక యువతి కుసుమ లేచింది ''అలా కాదు మేడమ్. పోటీ పెట్టుకుందాము. యెవరు బాగా డిబ్బా వాయించగలరో వారికి ఫస్ట్ ప్రైజ్'' అన్నది నవ్వుతూ.

అందరూ చప్పట్లు కొట్టారు.

''కార్టూన్ పోటీలాగా వుండాలి మేడమ్. నో యిల్‌విల్'' అన్నది కుసుమ.

తీసివున్న వాకిలి గుండా యిద్దరు పురుషులు సూటు ఆకర్షించగా, సెంటువాసన వ్యాపింపజేస్తూ లోనికి వచ్చారు.

''యేమిటి సంబరం? లేడీస్ క్లబ్ ప్రారంభోత్సవం చేసుకుంటున్నారా'' అన్నాడో ఆఫీసరు.

''సంబరం కాదు. లేడీస్ క్లబ్బా గదండీ పోటీ పెట్టుకుందామని లెక్చరర్ కుసుమ సజెస్ట్ చేస్తున్నది'' అన్నది కలావతీ.

''టాపిక్ యేమిటి?'' అనడిగాడు రెండో ఆఫీసరు.

కుసుమే వారివేపు తిరిగి జవాబిచ్చింది ''స్వంత డబ్బా యెవరు బాగా వాయించగలరు? వాయించి చూపాలి. మీరు పాల్గొంటారా? ఓపెన్ టు ఆల్'' అన్నది నవ్వు దాస్తూ

''నిరభ్యంతరంగా వాయిస్తాము. యే భాషలో వాయించాలీ?''

''తెలుగులో నేనండీ. ఈ సభ తెలుగు గొప్పతనం చెప్పటానికే జరుగుతున్నది''.

నడివయస్కురాలు నిలబడి, మగవారివేపు చూస్తూ చెప్పింది.

''వచ్చే ఆదివారం సాయంత్రం అయిదింటికి యేర్పాటు చేస్తామండీ. ఖర్చులు స్త్రీలవే. రిఫ్రెష్‌మెంట్సుంటాయి. వినలేక పారిపోకుండా మంచి పదార్థాలు తింటూ, వేడి కాఫీ తాగుతూనన్నా వుందామనుకుంటారనే ఆశతో యీ యేర్పాటు చేశాము కాని వక్తలకి యెక్కువ టైమివ్వము. అయిదూ మహా అయితే పది నిమిషాలు అంతే. దిగిపోకపోతే దింపేస్తాము. బోర్ కొట్టించరాదు. నవ్వించాలి. ఒక అతిథిని తెచ్చుకోవచ్చు''.

నిబంధనలు చెపుతుంటే వినేవాడి మొహం వెలిగిపోయింది. ''అలాగే మేడమ్. వచ్చే ఆదివారం కలుసుకుందాము. సోలాంగ్ . రా. ఆనందం'' అని పెద్ద డబ్బాలాగా వున్న ఆఫీసరు చిన్న డబ్బాలాగా వున్న ఆనందరావుని లాక్కెళ్లాడు.

కొంతమంది స్త్రీలు వారు వెళ్లిన వేపు చూశారు.

'' ఇవాళ సుదినం. సభ జయప్రదం చేసుకున్నాము. అనుకోకుండా వచ్చేవారం ప్రోగ్రామ్ ఫిక్స్ అయింది'' అలా నవ్వు మొహంతో అంటూ కలావతీ తన ముందున్న బల్ల మీది అందమైన డబ్బా గలగల్లాడించింది. వచ్చేవారం నిశ్చయంగా రాదలచినవారు అందులో నాణేలు వేశారు. డబ్బా గర్వంతో ఘల్లుఘల్లుమని నిండిపోయింది.

2

అధ్యక్షురాలు కలావతీ నిలబడి వివరించింది.

''నేడు స్వంత డబ్బా యెవరు బాగా వాయించగలరు? అని పోటీ జరుగుతుంది. మనం గొప్పవాళ్లం గనక పంక్చువల్‌గా, రంచన్‌గా అయిందింటికల్లా యిక్కడ గుమిగూడాము. డిశంబర్ నెలమంచు కురుస్తున్నది. త్వరగా కొంపకి చేరితే బాగుంటుంది. లేకపోతే రొంప పట్టుకుని ఆ భారం వల్ల పడకవేయచ్చు ఒకసారి సీసాపట్టుకుని, ఆసుపత్రికి ప్రదక్షిణం చేశామంటే అవి యెక్కువౌతాయి గాని తగ్గవు. ఇంటికే వైద్యుని రప్పించుకుంటే బాగా వదిలిస్తాడు. జిడ్డులాగా పట్టుకుంటాడు. కనక చేతనైతే యిద్దరిద్దరు డబ్బా వాయించచ్చు. మన క్లబ్ హాలు హౌస్‌ఫుల్లాగా అయింది. శ్రోతలతో కాదు సుమండీ. డబ్బా వాయించుకునే అవకాశం వదులుకోకూడదనే సదుద్దేశంతో వచ్చారు. తమకెప్పుడవకాశం వస్తుందా అనే ఆదుర్దాతో ముళ్లమీద కూచున్నట్టుండచ్చు వారి పరిస్థితి. సారీ అయిదు నిమిషాలైనై. నేను మోడెల్ అధ్యక్షురాల్ని. ఇంకా టైమ్ లాగితే మీరంతా నన్నుకరించవచ్చు. దిగూ దిగూ అని అరవటానికి సందు యిచ్చిన దాన్ని కావచ్చు. ఎక్సైటై కొట్టటానికి రావచ్చు. ఇది ఫ్రీ ఫరాల్. స్త్రీలను గౌరవించి మగవారు తమ పెద్దరికం నిలుపుకుంటారు. మనం తక్కువ తినలేదు. మనమూ మొదట పురుషునికి గౌరవమిద్దాము. వారి హక్కులకై పోరాటంలో పాల్గొంటాము. స్త్రీలతో సమాన హక్కులిద్దాము'' అని కళ్లద్దాల పైనించి సభికులను చూసింది.

ఆడియన్సు హర్షం వెలిబుచ్చుతూ కరతాళ ధ్వనులు చేశారు.

ఒక టీనేజరు నిలబడి ''యిద్దాము. యిద్దాము'' అని సెకండ్ చేసి చేయివూపి కూచున్నది. ఆ టీనేజరు పేరు గుణమణి.

కలావతీ తన ముందున్న కాగితం అందుకు పైకిపట్టుకు అనౌన్స్ చేసింది. ''మొదట తోడేలు డబ్బారావు గారు. సారీ. టైపిస్టు తప్పుగా టైప్ చేసిందేమో. కొండేలు అని వుండాలేమో తోడేలనే యింటి పేరుంటుందా? సుబ్బారావు

గారేమో, యస్‌కి బదులు కొంటె టైపిస్టు డ వాడిందేమో'' అని విచారం వెలిబుచ్చింది.

గుణమణి లేచి నిలబడింది ''యెందుకుండదు మేడమ్ నక్కి వారున్నారుగా'' అని నవ్వి కూచున్నది.

కలావతీ కళ్లజోడు సరిజేసుకుని చదివింది ''రెండోవారు నక్కా బక్కేశ్వర్రావు గారు. అరె! నిజంగానే వున్నదే యీ యింటి పేరు. బటుకేశ్వర్రావు గారేమో. తర్వాతి ఛాన్సు మైనం బొమ్మ దేవిగారికి'' అంటుండగానే ఆమె పేర్కొన్న వారిద్దరూ, బూట్ల టకటకా చప్పుడు చేస్తూ సెంటువాసన విరజిమ్ముతూ, కళ్లజోళ్లు మెరుస్తూ వేదిక నెక్కారు.

''సభికులకు నమస్కారం. మీకున్న హక్కులన్నీ మా కక్కర్లేదు. దండగ గూడాను. ఎక్స్‌టెన్సివ్. నసపెట్టటం, టూ మచ్ ప్రొడక్షన్ తెలివిని వెల్లడించవు. ఇంటి పేరేమైతేనేమిటీ. ఐ డోంట్ కేర్. డబ్బుంటే గూడా నాకు ఖాతర్లేదు. మనిషి కంటికి నదరుగా వున్నాడా లేదా, వారిది హేపీ ఫామిలీ అవునా కాదా చూడాలి. మాది సమిష్టి కుటుంబం. వూళ్లో వాళ్లు'' అన్నదమ్ములు కొట్టుకోరేం? తిట్టుకోరేం? భాగాలు పంచేసుకోరేం?'' అని ముక్కుమీద వేలేసుకుంటారు'' అని మొహం కర్చీఫ్‌తో అద్దుకుంటుండగా గుణమణి ''యింకా నయం'' అన్నది. నా చిన్నప్పటినించే దబ్బపండు రంగులో వున్నాడని బంధుగులు మెచ్చేవారు. మాంచి వలమూ పొడుగూ అయి ఆకర్షించాను. అసలు నా ముక్కు అన్నిటిలోకీ, అందరి ముక్కులకన్నా బాగుంటందేనేవారు. మొహానికి ముక్కే అందం ఇన్సూర్ చేయమని ప్రోత్సహించారు భీమా సంస్థవారు. హైస్కూల్లోనే గాక, జాబ్‌లో చేరినా నా ముక్కే అందర్నీ ఆకర్షించింది'' అని కదిలిపోతూ ముక్కుపట్టుకు చూపాడు'' ఆ ముక్కు చూసే పిల్లనిస్తామని వచ్చారు ఆస్తిపాస్తులడగ లేదు. బ్రైడప్పుడే అట్టి ముక్కు మరొకడికి లేదు వాడినే చేసుకుంటాను. యెంత కుమ్మరించైనా సరే అని భీష్మించింది. అంతేనా నమ్మరేమో, నా పర్సనాలిటీ, నా వర్ఛస్సూ దబ్బపండు రంగూ, ప్రత్యేకించి నా ముక్కూ చూసినవారు గమనించినవారు, మినిష్టర్ని ప్రారంభోత్సవానికి బలవంతంగా లాక్కెళ్లినట్టు, ''పెళ్లికొడుకు వేషమేద్దువుగాని

రా. నిశ్చయింపబడినవాడు తగడు. కాకి ముక్కుకి దొండపండు లాగా వుంటుంది అమ్మాయి. యేదో పిల్ల సుఖపడుతుందనీ, ఆస్తీ వుద్యోగమూ పిన్న వయసూ చూసి నిశ్చయించాము. యెవరూ కనుక్కోలేరు. రాత్రి ఒకటి నలభైకి ముహూర్తం పెళ్ళివారు నిద్రకు జోగుతారు. యేడున్నరకే విందు యిచ్చామా పొట్ట భర్తీగా మెక్కి కూచోలేక నేల కొరుగుతారు. యెంతా మొదటి కార్యక్రమం ముగియగానే తెర పీకటం, కాళ్ళు కడగటం వరకే'' అని భరోసా యిచ్చారు, లాక్కెళ్లారు. నా పాదాలెంతో బాగుంటాయి అవి కడిగితేనే చాలని వుబలాట పడ్డాడు తండ్రి. తర్వాత అసలు గ్రూము కూచుంటాడు. సూత్రధారణ తాళి అనేవి మన స్క్రిప్ట్సులో లేవు. సప్తపది పాణిగ్రహణం నాతి చరామి చాలు. తక్కిన తతంగమంతా అనుకరణ'' అని వాచీ చూసుకున్నాడు ''ఇంకొంచెమే టైమున్నది త్వరగా ముగిస్తాను. మా అమ్మాయి ముక్కూ బాగుంటుంది. అసలు మా అమ్మ ముక్కే సంపంగి రెక్కలాగా షోగ్గా వుంటుంది. పదమూడేళ్లకే మా అమ్మ రేవతిలాగా నా అంతెత్తు పెరిగింది. ఆయన్ని ఒక కుర్చీ పీట మీద నించోబెట్టినా, మా అమ్మే ఓ గుప్పెడు యెక్కువ యెత్తున్నది'' అంటుండగా గుణమణి లేచి అడిగింది. ''మీరు మీ అమ్మ పెళ్లికి హాజరైనారా?'' బకేశ్వర్రావు మోచేత్తో పొడుస్తూ వాచీ చూపించాడు. రహస్యంగా అన్నాడు. ''రేషన్. రేషన్''.

సభికులలో నవ్వులు బయలుదేరాయి. తర్జనితో చూపిస్తూ, ''నవ్విస్తున్నావులే ఆపేయ్ నన్ను చెప్పనీ, చాదస్తం నలభై నిండినా యింకా ముక్కు మీద మోహమలాగే వున్నది'' అంటూనే తాను మొదలెట్టేశాడు బకేశ్వర్రావు.

''అమ్మా! అమ్మా! వీడి ముక్కు మూరెడు, వీళ్లకూ సిగబారెడు. అంటే మోకాటి పల్లం వరకు పడుతుంది'' అని అభినయించాడు. ''యేం లాభం? యింకా నయం మరో టాపిక్ మీద డబ్బా వాయించాడు గాదు'' అంటుంటే సభికుల నవ్వులు పెద్దవైనై. ''మీరంతా రిఫ్రెష్‌మెంట్సు వదిలి పారిపోయేవారు. నేను పొట్టి అనీ, నాది బుర్రముక్కనీ వీళ్లకలా నన్ను రిజెక్ట్ చేసింది. అంతగా ముక్కు డబ్బా వాయించాడా. తరచూ రొంప భారంతో ముక్కూ మొహం వుబ్బరిస్తాయి నా మిత్రుడికి. ఇహ మిరియాల కషాయం తాగుతాడు, మిరియం

పొగ పీలుస్తాడు. నేసల్ డ్రాప్స్, విక్స్ వేపరబ్ వాడతాడు. మనకి ముక్కు పాటగాడని పేరుబడిన ఒక నటుడుండేవాడు. వీళ్లన్న జలుబు రాకండా లవంగాలు నవలటం, కాల్చిన లవంగాలు తినటం చేస్తాడు అందర్నీ ఆకర్షించి సింపతీ వేవ్ తెప్పించాలని ఆస్త్మా ఎటాక్‌ని ఆహ్వానిస్తాడు. సిగబారెడైనా వీళ్లప్పకి పెద్దగా లాభించలేదు. నాది బుర్రముక్కయితేనేం నాది ప్రపోర్షనేట్ బాడీ. రెడీమేడ్ దుస్తులెంచక్కా ఫిక్సౌతాయి. అందాల పోటీకి రమ్మన్నారు నన్ను. లా పూర్తి చేసుకోవాలని పోలేదు. వీళ్లక్కకి సంబంధం కుదిరిందని విని వెళ్లి ''జాతకాలు చూశారా, సరిపోయాయా?'' అంటే యెర్రగా చూసి'' మాకా ఛాదస్తాలు లేవు'' అని తరిమేశారు నన్ను. యేమిటి బావుకున్నారుటా? పిలవక పోయి పిలవని పేరంటంలాగా పెళ్లికి వెళ్తే, పెళ్లిలోనే పెండ్లి కుమారుడు ధూమ్రాక్షునిలాగా కనిపించాడు. మతి స్థిమితంలేదేమో అని అనుమానం కలిగింది నాకు. పైకంటినా చితకబొడుస్తారు నన్ను అనుకున్నంతా అయింది. పెళ్లి అయిన తొమ్మిదో రోజు పెండ్లి కుమారుడు యించక్కగా వురెట్టుకున్నాడు. దాంతో హతాశురాలై వీళ్లక్క తెగబారెడు జుట్టూ తీయించేసింది. సవరాలుగా చేయించి అమ్మించింది. నేనన్యాయం గెలిపించను. తోక్కోసి పంపిస్తా తోక్కోసి పంపిస్తా'' అని అభినయిస్తున్నాడు. నలుగురమ్మాయిలు నవ్వుతూ వచ్చి లాక్కెళ్లారు.

బొమ్మాదేవి బొమ్మలాగే హెవీ మేకప్‌తో వచ్చేసింది వేదిక మీదికి. ఆలస్యం చేయకుండా మొదలెట్టేసింది. ''మా నాన్నగారికి భేదభావమే లేదు. యేదికొన్నా నలుగురు కూతుళ్లతో సమానంగా నలుగురు కోడళ్లకీ కొంటారు'' ఆమె ఫ్రెండు వాగేశ్వరి మెల్లిగా వేదిక మీదికి వచ్చింది.

''హయ్యో మీ నాన్నా! నా ఆలి గుణం నేనెరగనా అన్నాడట. యెదురిల్లేగా మాదీ. తల్లి పుట్టింటి గొప్ప మేనమామ దగ్గర. నేను నీకు మేనమామ పెళ్లాన్నే'' అని సభికుల వేపు చూసి, ''మీకు నవ్వు వస్తున్నదా. నవ్వరేం? వింటే గప్పాలు బాగానే కొడుతుంది మా వారి మేనగోడలు. ''మా నాన్నగారు ఒక్కొక్క కూతురుకి లక్ష ఫిక్సిడ్ డిపాజిట్‌లో వేసి కట్ట దండా, కాసుల పేరూ, కారూ అంటూ 'క' గుణింతం మొదలెడుతుంది. లక్ష్మి పతకమున్న ముత్యాల హారం

పెట్టారంటుంది. నా వేపు ఒక తమ్ముడికో పిల్ల నిచ్చారు. దాని మొహానే ముద్దులూ లేవు. అదేమంటే యెమ్మే పాసై స్టేజెక్కి డాన్సు చేసి బహుమతి తెచ్చుకున్నది చాలదా అన్నారు. నా నగలు, ముక్కులో ముక్కు పుడక దగ్గర్నించీ అన్నీ నేనే కొనుక్కున్నా'' అని చేతులు తిప్పింది.

''నువ్వు కాసేపు గుళ్లాన్ని కట్టేయి వాగీ'' అన్నది బొమ్మాదేవి మాకు సడెన్‌గా బదిలీ అయింది పిల్లవాడిని పిల్లను అత్తగారి వద్ద వదిలి వచ్చేశాము. వాళ్లకి చిరుతిండి అలవాటు. అత్తగారు బజారు సరుకు యింటికి తేనివ్వదు. అది గుర్తుంచుకుని, నేను స్వయంగా చేసి డబ్బాలలో నింపి పంపాను. మా అబ్బాయి వుత్తరం రాశాడు. ''అమ్మా! అన్నన్ని తినుబండారాలు, జంతికలు, చేగోడీలు, రింగులు, గవ్వలు, ఖజ్జి కాయలు డబ్బాల నిండా నింపి పంపకు. మామ్మ తాను ఆకలైనప్పుడల్లా తిని, పనివాళ్లకీ, పొరుగువాళ్లకీ పంచుతున్నది. చిన్న డబ్బీలో కాసినే పెట్టి పంపితే మా యిద్దరికీ చాలు రెండురోజుల్లో అయిపోతాయి. చెయ్యిలేవు పిన్ని అత్తింటికొచ్చింది. ఒక్క పనీ చెయ్యదు. జాబ్ చేస్తున్నదిట అదీ గర్వం అన్నీ మామ్మే చేసుకుంటున్నది. మరి నువ్వుంటే తను రాణీలాగా కూచుని నీ చేత అన్ని పన్లు చేయించేది''.

మూడో వక్త వచ్చేసింది. ''దిగిపోండి'' అని చెయ్యివూపింది.

''నన్ను చూశారుగా. దీని పేరు అధునాతన అలంకరణట. నాకు వూపిరాడటం లేదంటే వినడు మా ఆయన. తెలుగులో మాట్లాడరాదట. మీరు తెలుగులో నా గోడు వినిపించవచ్చనేప్పటికి ప్రాణం లేచి వచ్చింది నాకు. కారుతోలటం నేర్పాడు. నాకు వణుకు గుండె దడా అందుకుంటుంది. కారుకి మూడుసార్లు ప్రదక్షిణాలు చేసి మొక్కి నిమ్మకాయ మీదిగా పోనిచ్చి, నిమ్మకాయల దండ కారులో వేలాడదీసి బయలుదేరుతాను. బాకింగ్ అంటేనే మూర్ఛ వస్తుంది. దేనికన్నా గుద్దుకుంటానేమో. మా ఆయనే వస్తాడోనని గుండె గుబగుబలాడుతుంది'' అంటున్నది. మరో యిద్దరు చనువుగా వచ్చి ఆమె కిరువైపులా నిలిచారు.

చలి హెచ్చుతున్నదని రిఫ్రెష్‌మెంట్సు పంచసాగారు సర్వర్సు.

''మేడమ్. చల్లారిపోతున్నాయి. కాఫీ తెచ్చేస్తున్నాము'' అని మనుషుల మధ్యగా ట్రేలతో తిరుగుతూ ఫలహారమున్న ప్లేట్లు అందిస్తున్నారు. ఖాళీ అయి కిందవుంచిన ప్లేట్లని తీసి అట్టపెట్టె పెద్ద పెట్టెలో వుంచివస్తున్నారు సర్వర్లు. మంచి నీళ్ల గ్లాసులొచ్చినై.

''యేమంటాడు సుందర్! కట్నం తీసుకోనంటున్నాడా కోటేశ్వర్ నీవు వినలేదేమో, వాళ్ల నాన్న ముందే పిల్ల పేర మూడు లక్షల ఫిక్సెడ్ డిపాజిట్ పెట్టించాడు బాంకులో. పిల్లను వుద్యోగంలో యిరికించి మరీ పెళ్లికానిమ్మన్నాడు. అహహా!'' అని నవ్వుతున్నాడో డబ్బా వాయించినవాడు.

''యేమిటే దాని డిబ్బా! వినలేక చచ్చాంపో. యెప్పుడు దిగిపోతుందా యెప్పుడు నా వంతు వస్తుందా అని వాచీ చూస్తూ కూచున్నాను సుమీ. తనను కావాలని యేరీ కోరీ వలచి చేసుకున్నాడంటుందేం? ' ఓ వైదర్భీ నీవలని ప్రునిచే ప్రియలేఖలునాకును బంపగ' అదే యీ వైదర్భి చేసింది. మోసం పైకి రానీయలేదు. ఇంచక్క మోసపోయారు మగపెళ్లివారు. పిల్లకాపరానికి రాగానే మోసం తెలిసిపోయి విడాకులు తీసుకోమన్నారు. పిల్లవేపు వారు అమ్మాయికి పెళ్లినాడు వంటిమీద లక్ష నగలు బంగారువి పెట్టాము అవి యిచ్చేయాలి అన్నారు. అవి నకిలీవి అంత వెలవుండవు అని మగపెళ్లివారు అంటువ్యాధి వున్న పిల్లనంటగట్టారని లడాయి వేసుకుని యెగేసేట్టున్నారు. కేసు పెండింగులో వున్నది సుమీ'' అనుమాయమ్మ అనే మిడిలేడ్జ్ సమోసా ఆరగిస్తూ చెప్పింది.

యెంత సేపటికీ అవకాశం యిచ్చేట్టూ వచ్చేట్టూ లేరని, ఫ్రస్ట్రేట్ అయి చాలా మంది వేదిక మీద కెక్కారు. నెట్టుకోనూ, తోసుకోనూ, లాగనూ చేస్తుంటే, కింద నించుని చూస్నున్న టీనేజర్సూ, మగవాళ్లూ నవ్వుతూ చూస్తూ ప్రోత్సహిస్తున్నారు.

పరాయి రాష్ట్రాలవారు తమ మాతృభాషలో డబ్బా వాయిస్తున్నారు వింటున్నా రాలేదే అని గాదు. కాంట్ హెల్ప్. అలా వాయించితే కొంత రిలీఫ్ వస్తుంది.

వేడి కాఫీ చప్పరిస్తూ ప్రేక్షకులు, ''డబ్బా వాయిద్యం కన్న యాక్షన్ పాకింగ్ చిత్రంలాగా యిదింకా బాగుంది'' అని నవ్వుతున్నారు.

రిఫ్రెష్మెంట్లు పూర్తి అయాయి. అందరూ కిందికి దూకుతూ మెట్లు దిగుతుండగానే సర్వెంట్సు, వేదిక మీదికి మోసుకెళ్తూ వేదిక ఖాళీ చేయసాగారు. వేరేవి తెచ్చి అమర్చాలి. ఇంకా మైక్ తీయలేదు. అధ్యక్షురాలు మైక్ ముందున్నది.

''దయచేసి మీరంతా మీ కుర్చీల్లో ఆసీనులు గండి. తొమ్మిదికి పది నిమిషాలు తక్కువ. తొమ్మిదింటివరకే ప్రోగ్రామ్ అని ఒప్పందం. మరొకరికి అద్దెకిస్తామని బయానా గూడా పుచ్చుకున్నారు. పోవాలి. నిశ్శబ్దం'' కలావతీ అనౌన్స్ చేసింది.

'ఫస్ట్ ప్రైజ్ సుగుణావతి. అత్తగారూ తానూ సయోధ్య కలిగివున్నదీ, అభినయంతో సహా, వేదిక మీద గస్తీ తిరుగుతున్నట్టు తిరిగారు. సత్యమేమనగా ఆమె వంటిమీద, అత్తగారు పెట్టిన వాతలూ, మొగుడు కొట్టగా కమిలిన చోట్లు, మొట్టగా కట్టిన బొప్పులూ వున్నాయి. మనందర్నీ నమ్మిస్తూ డబ్బా చాలా బాగా వాయించారు. సుగుణావతిగారూ వేదిక మీదికి రావాలి''. ప్రైజ్ అత్తగారిది వెండిబొమ్మ. సుగుణావతి వినయం చూపి థాంక్సు చెప్పి దిగిపోయింది. 'సెకండ్ ప్రైజ్ తోడేలు డబ్బారావుగారు. సారీ మళ్లా తప్పు చదివాను. కొండేలు సుబ్బారావు గారు'' అని నవ్వింది.

''డెవిల్ ఇన్కార్నేషన్ వంటి మదరుగార్ని పొగడుతూ డబ్బా వాయించి మన చెవులు చిల్లులు పడేశారు. పైకి రండి'' అన్నది.